సాక్షి ఒడిశా

మంగళవారం । 6 । మే । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,33,081లు, బంగారం 9గ్రాముల 300 మిల్లీగ్రాములు, వెండి 700 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.

## కలప దుర్వినియోగం కాలేదు



జగన్నాథుని మిగులు కలప దుర్వినియోగం కాలేదు. ఈ మేరకు నివేదిక సమర్పించారు.

- 8లో



## ఎమ్మెల్యే సహృదయత

కొట్‌పాడ్ ఎమ్మెల్యే సహృదయత చాటారు. రోడ్డు ప్రమాద బాధితులకు సాయం చేశారు.

- 8లో

## న్యూస్‌రీల్

### సైబర్ మోసగాళ్ల అరెస్టు



మోసగాళ్ల నుంచి పోలీసులు స్వాధీనం చేసుకున్న సొత్తు

భువనేశ్వర్: సైబర్ మోసాలకు పాల్పడిన నిందితులు పోలీసులకు చిక్కారు. కటక్ సైబర్ ఠాణా పోలీసులు ఆరుగురు నిందితుల్ని అరెస్టు చేశారు. వీరి దగ్గర నుంచి రూ. 78 లక్షల విలువైన సామగ్రితో నగదు స్వాధీనం చేసుకున్నారు. వీరంతా బొలంగీరు ప్రాంతీయులుగా పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. వీరి దగ్గర నుంచి రూ. 12 లక్షల నగదు, చెక్ పుస్తకాలు, పాస్‌బుక్‌లు, మొబైల్ ఫోన్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దర్యాప్తు కొనసాగుతోంది.

### ఇంటి పనిమనిషి, ఆమె కుమార్తెపై లైంగికదాడి



నిందితుడు

భువనేశ్వర్: నగరంలోని ఓ ఇంటి పనిమనిషిపై యజమాని లైంగికదాడికి పాల్పడిన ఘటన వెలుగు చూసింది. ఈ వ్యవహారంలో బొడొగొడొ ఠాణా పోలీసులు నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుని విచారణలో ఆరోపణ అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. ఇంటిలో పనిచేస్తున్న మహిళ, ఆమె మైనర్ కుమార్తెపై అత్యాచారానికి పాల్పడినట్లు ఆరోపణ. ఇంట్లో పని చేసే సమయంలో తల్లీ కూతుళ్ల వ్యక్తిగత దృశ్యాలను రహస్యంగా వీడియో చిత్రీకరించి ప్రత్యక్షంగా బెదిరింపులకు దిగాడు. వీడియోలను ఆన్‌లైన్‌లో ప్రసారం చేస్తానని బెదిరించాడు. అనంతరం వీరివురిపై అత్యాచారానికి పాల్పడినట్లు బాధిత వర్గం స్థానిక ఠాణాలో పోలీసులకు ఫిర్యాదు చేసింది. వీరి ఫిర్యాదు ఆధారంగా నిందితుడిని అరెస్టు చేశారు. నిందితుడిని సరోజ్ కుమార్ బెహరాగా గుర్తించారు. నిందితుని వ్యతిరేకంగా జాజ్‌పూర్ ప్రాంతంలో అనేక కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

### భారీగా బయటపడిన అక్రమాస్తులు



కోర్టుకు శకుంతలని తెస్తున్న విజిలెన్స్ సిబ్బంది

కొరాపుట్: కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ సమితి సీడీపీఓ శకుంతల దాస్ తన కింది స్థాయి ఉద్యోగిని వద్ద రూ.10 వేలు లంచం తీసుకొని పట్టుబడిన విషయం పాఠకులకు విదితమే. ఈ ఘటన అనంతరం ఆమె ఆస్తుల వివరాలు కోసం విజిలెన్స్ సిబ్బంది రాష్ట్ర వ్యాప్తంగా దాడులు నిర్వహించి నివ్వెరపోయారు. ఆమెకు భువనేశ్వర్‌లో అతి ఖరీదైన ప్రాంతం డుముడుమాలో 3,300 చదరపు అడుగుల విస్తీర్ణంలో మూడంతస్తుల భవనం, కొరాపుట్ జిల్లా సిమిలిగుడ లో రెండస్తుల భవనం, పూరీలో నిర్మాణంలో ఉన్న భవనం, సిమిలిగుడలో జాగా, రూ.78 లక్షల విలువ గత బ్యాంక్ డిపాజిట్లు ఉన్నట్లు గుర్తించారు. శకుంతలదాస్‌ని జయపూర్ విజిలెన్స్ కార్యాలయం నుంచి కోర్టుకి తరలించేటప్పుడు పోలీసుల వ్యాన్ ఎక్కేముందు తన ఆస్తులు కూడా కనుగొని విజిలెన్స్ వారు సీజ్ చేశారని తెలిసింది.

### దిఘా జగన్నాథ ఆలయ వివాదంపై దర్యాప్తు

భువనేశ్వర్: పశ్చిమ బెంగాల్ దిఘాలో కొత్తగా నిర్మించిన జగన్నాథ ఆలయంపై రగులుతున్న వివాదాలపై బిజూ జనతా దళ్ (బీజేడీ) రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసింది. దిఘా వివాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన దర్యాప్తుపై బీజేడీ నాయకుడు ప్రసన్న ఆచార్య ప్రశ్నలు లేవనెత్తారు. గత ఏడాది 2024లో పూరీలో జరిగిన రథయాత్రలో బలభద్రుని విగ్రహం కూలిపోవడంతో సహా అనేక విచారకర, అశుభ సంఘటనలు జరిగాయని ఆయన గుర్తు చేశారు. ఈ సంఘటనలపై రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన దర్యాప్తు ఫలితాలను బహిర్గతం చేయాలని, అలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిరోధించడానికి కచ్చితమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పూరీలోని శ్రీ జగన్నాథ ఆలయంలో నబకలేబార్ వేడుక నుంచి మిగులు కలప (పవిత్ర దారు)ను దిఘాలోని కొత్త మందిరం విగ్రహాల తయారీకి ఉపయోగించారనే ఆరోపణలపై బీజేడీ ఉపాధ్యక్షుడు ప్రసన్న ఆచార్య ఒడిశా ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని ఈ విషయాల్ని తెరపైకి తెచ్చారు.

# పా పాలు .. ప్రజారోగ్యానికి శాపాలు

- ఒడిశా మార్కెట్లో కాలం చెల్లిన హెరిటేజ్ ఉత్పత్తులు
- ఫుడ్ సేఫ్టీ అధికారుల దాడుల్లో వెలుగు చూసిన వాస్తవాలు
- విక్రయిస్తున్న దుకాణాలు సీజ్
- సోషల్ మీడియా పోరాటంతో బయటపడిన బాగోతం



కాలం చెల్లిన హెరిటేజ్ పెరుగు ప్యాకెట్లని చెత్త బుట్టలలో వేస్తున్న మున్సిపల్ సిబ్బంది

కొరాపుట్, జయపురం:

ఆంధ్రా నుంచి ఒడిశాకు వస్తున్న హెరిటేజ్ ఫుడ్స్ అసలు బండారాన్ని అధికారులు బయటపెట్టారు. కాలం చెల్లిన సరుకులు అమ్ముతున్న వైనాన్ని జనం ముందు ఉంచారు. ఆంధ్రప్రదేశ్ నుంచి జయపూర్ వస్తున్న హెరిటేజ్ పెరుగు, పాల ప్యాకెట్లే లక్ష్యంగా ఫుడ్ సేఫ్టీ అధికారులు దాడులు చేశారు. సోమవారం కొరాపుట్ జిల్లా కేంద్రం నుంచి వచ్చిన జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి ప్రభాత్ కుమార్ శెఠి నేతృత్వంలో అధికారులు హెరిటేజ్ ఉత్పత్తులు విక్రయిస్తున్న షాపులపై మెరుపు దాడులు చేశారు. ఎంజీ రోడ్డు, మెయిన్ రోడ్డు, సంగీత జంక్షన్‌ల వద్ద జరిపిన సోదాల్లో కాలం చెల్లిన పాడైన పెరుగు ప్యాకెట్లు పెద్ద ఎత్తున దొరికాయి.

### అంతా మా ఇష్టం

వాస్తవానికి పాల ఉత్పత్తుల సంస్థల అవుట్ లెట్లలో విక్రయించే వారికి కొత్త ఉత్పత్తులు ఇచ్చేటప్పుడు కాలం చెల్లిన ఉత్పత్తులు తిరిగి తీసుకొని వెళ్తారు. ఇదే పద్ధతి ఒడిశా ప్రభుత్వ పాల ఉత్పత్తి సంస్థ అమలు చేస్తుంది. ప్రతి రోజూ కొత్త ఉత్పత్తులు ఇవ్వడంతో పాటు కాలం చెల్లిన ఉత్పత్తులను తమ వ్యాన్‌లోనే తిరిగి తీసుకొని పోతారు. కానీ హెరిటేజ్ ఈ నిబంధన పాటించడం లేదు. ఆంధ్రా నుంచి ఉత్పత్తులు తేవడమే తప్ప పాడైన వాటిని తిరిగి తీసుకువెళ్లడం లేదు. అడిగేవారు ఎవరూ లేకపోవడంతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

### పక్క జిల్లా అధికారి రాక..

హెరిటేజ్ పై జయపూర్ ప్రజలు సోషల్ మీడియాలో చేస్తున్న విమర్శలు రాష్ట్ర రాజధాని వరకు వెళ్లాయి. దాంతో పక్కనే ఉన్న మల్కన్ గిరి జిల్లా నుంచి ఫుడ్‌సేఫ్టీ అధికారి ప్రభాత్ కుమార్ శెఠిని ఇన్‌చార్జి హోదాలో పంపించి ప్రభుత్వం దాడులు చేయించింది. కొత్త ముఖాలు కావడంతో దాడుల నుంచి ఎవరూ తప్పించుకోలేకపోయారు. దాడుల అనంతరం ప్రభాత్ కుమార్ మీడియాతో మాట్లాడారు. హెరిటేజ్ పై వస్తున్న విమర్శలు నిజమేనని ప్రకటించారు. తానే స్వయంగా కలుషిత హెరిటేజ్ ఉత్పత్తులు పట్టుకున్నానని మీడియాకి చూపించారు. ఇంకా ఎక్కడైనా ఫిర్యాదులు ఉంటే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలన్నారు.

### ప్రజారోగ్యంతో చెలగాటం

హెరిటేజ్ సంస్థ ప్రజల ఆరోగ్యం తో చెలగాటం ఆడింది. కాలం చెల్లిన పాలు, పెరుగు తీసుకోవడం ఆరోగ్యానికి హానికరం. పట్టణంలో దాడులు జరుగుతున్నప్పటికీ ఇతర షాపులలో విక్రయాలు యథేచ్ఛగా కొనసాగించారు. అందుకే అధికారులు హెరిటేజ్ సిబ్బందిని వెంటబెట్టుకొని వెళ్లి దాడులు చేసి తాము పట్టుకున్న కలుషిత హెరిటేజ్ ఉత్పత్తులు వారికి చూపించి వారి సమక్షంలోనే మున్సిపాలిటీ చెత్త డబ్బాల్లో వేశారు. ఈ దాడులు జరుగుతున్నప్పుడు పెద్ద ఎత్తున ప్రజలు వారి వెంట తరలి వెళ్లారు. పెద్ద మొత్తంలో పాడైన హెరిటేజ్ ఉత్పత్తులు ఉన్న షాపులను సీజ్ చేశారు. పలు షాపుల యజమానులకు ఫైన్‌లు విధించారు.

### బాధిత మహిళల ఇంటికి హెరిటేజ్ సిబ్బంది

ఇటీవల జయపూర్ పట్టణంలో హెరిటేజ్ పెరుగు ప్యాకెట్లు కొన్న మహిళలు అందులో కలుషిత పదార్థాలు చూసి సోషల్ మీడియాలో పెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. దాంతో హెరిటేజ్ కంపెనీ ప్రతినిధులు మీడియా ముందుకు వచ్చి అవి కాలం చెల్లినవని వివరణ ఇచ్చారు. మహిళల పోస్టింగ్స్ పెద్ద ఎత్తున వైరల్ కూడా అయ్యాయి.



పెరుగు ప్యాకెట్ల తనిఖీ



సోదాలు జరుగుతున్న దృశ్యం



బయట పడ్డ కలుషిత వ్యర్థాలు



కాలం చెల్లిన పదార్థాల నిర్వీర్యం

### హెరిటేజ్ వద్దు.. ఓం ఫైడ్ ముద్దు

ఈ ఘటన తర్వాత ఒడిశా పాల ఉత్పత్తుల సంస్థ ఓంఫైడ్ పై ఒక సారిగా ప్రజల ఆదరణ పెరిగింది. హెరిటేజ్ బాగోతం వెలుగులోకి వచ్చిన తర్వాత ప్రజలు ఓంఫైడ్ కొనుగోళ్లు ప్రారంభించారు. స్థానిక ప్రజల వద్ద కొనుగోలు చేసిన పాలనే శుద్ధి చేసి అంతర్జాతీయ ప్రమాణాలలో ఓంఫైడ్ నడుస్తుంది. ఏనాడూ ఓంఫైడ్ పై ప్రజల నుంచి ఫిర్యాదులు లేవు. జయపూర్‌లో ఓంఫైడ్ ప్లాంట్ ఉంది. గత ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ దీన్ని ప్రారంభించారు. ప్రస్తుతం అందరి నోట ఓంఫైడ్ పేరు మారుమోగుతోంది. హెరిటేజ్ పాలు ఎన్నడూ విరగలేదని, అలా ఉండేందుకు ఏం రసాయనాలు కలిపారో అని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## సరిహద్దు క్రమబద్ధీకరణకు ఉత్తర్వులు

భువనేశ్వర్: రాష్ట్రంలో సరిహద్దు క్రమబద్ధీకరణ కార్యాచరణకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలో జనాభా లెక్కలు ప్రారంభం కానున్నాయి. ఈ తరుణంలో ఈ పనుల కోసం ఉత్తర్వులు జారీ కావడం ప్రాధాన్యత సంతరించుకున్నాయి. విభాగం ఈ కార్యకలాపాల కోసం జూన్ 30 వరకు గడువు కేటాయించింది. త్వరలో ప్రారంభం కానున్న జనాభా లెక్కింపు సజావుగా, కచ్చితంగా జరిగేలా చూసేందుకు ఈ చర్యను సన్నాహక చర్యగా భావిస్తున్నారు. జనాభా గణనకు సన్నాహాలకు నేరుగా ముడిపడి ఉంది. గణన ప్రక్రియలో స్థిరత్వం, డేటా కచ్చితత్వాన్ని కొనసాగించడానికి పరిపాలనా సరిహద్దులు స్థిరంగా ఉండాలి. కచ్చితమైన వివరాల సేకరణతో జనాభా గణనకు అత్యంత కీలకంగా దోహదపడి స్పష్టమైన దశ, దిశ నిర్ధారిస్తుంది. జనాభా గణన నియమాలు, 1990, 8 (4) నియమం ప్రకారం పరిపాలనా సరిహద్దు సర్దుబాట్ల కోసం ఒక పటిష్టమైన ప్రణాళిక ఖరారవుతుంది. కచ్చితమైన గణాంకాల సేకరణను నిర్ధారించడానికి జనాభా గణనకు అవసరమైన స్థిరమైన సరిహద్దులు సమగ్ర ప్రక్రియను సులభతరం చేస్తుంది. అధికారిక ఉత్తర్వులు ప్రకారం రాష్ట్రంలో జిల్లాలు, సబ్-డివిజన్లు, తహసీళ్లు, రెవెన్యూ గ్రామాలు, పట్టణ స్థానిక సంస్థలు సహా అన్ని స్థాయిల పరిపాలనా విభాగాలను పునర్ వ్యవస్థీకరిస్తారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది జూన్ 30 వరకు జిల్లాలు, ఉప విభాగాలు, తహసీళ్లు, రెవెన్యూ గ్రామాలు, పట్టణ స్థానిక సంస్థల పరిపాలనా సరిహద్దులలో మార్పులను అనుమతిస్తారు. జనాభా మార్పులు, పాలన అవసరాలు లేదా విపత్తు నిర్వహణ అవసరాల కారణంగా ఏవైనా అవసరమైన పునర్ వ్యవస్థీకరణలను జనాభా గణనకు ముందు పరిష్కరించేందుకు ఈ చర్య నిర్ధారిస్తుంది. మరో వైపు 2020 నుంచి 2024 సంవత్సరం వరకు జారీ చేసిన అనేక మునుపటి ఆదేశాలను తాజా జనాభా లెక్కింపు ప్రక్రియకు దోహదపడేలా నవీకరించేందుకు పరిపాలనా సరిహద్దు పునర్వ్యవస్థీకరణ ఉపకరిస్తుంది. ఈ ప్రక్రియ అంతటిని నిర్ధారిత గడువు లోగా ముగించడం అనివార్యమని ఉత్తర్వులు స్పష్టం చేశాయి.

## విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, జర్నలిస్టులు

మల్కన్‌గిరి: జిల్లా కలిమెల సమితి ఎం.వి.79 గ్రామ ఉన్నత పాఠశాలలో చదివి 10వ తరగతిలో 600 మార్కులకు 560 మార్కులను కవలలు డానియెల్ లెంక, డోంబురు లెంక సాధించారు. రెండో స్థానంలో కేశవ్ కోర 537 మార్కులతో నిలిచారు. ఈ ముగ్గురు విద్యార్థులకు జిల్లా ఉత్కళ జర్నలిస్టు సంఘం కలిమెల జర్నలిస్టులు సోమవారం పాఠశాలలో అభినందించారు. హెచ్‌ఎం ప్రశాంత్ కుమార్ నాయక్, ఉపాధ్యయుడు విభూతి భూషన్ సేఠి, కవితా సర్కార్, హిమాంశు మండల్, సర్మిళ డాలి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కొరాపుట్ జిల్లాలో చీఫ్ సెక్రటరీ పర్యటన



కొరాపుట్‌లో మెడికల్ కాలేజ నుంచి వస్తున్న చీఫ్ సెక్రటరీ మనోజ్ ఆహుజా, పక్కనే ఎస్పీ రోహిత్ వర్మ



అర్బన్ ఆస్పత్రిలో రోగుల సేవలు ఆరా తీస్తున్న మనోజ్ పక్కనే కలెక్టర్ వి.కీర్తి వాసన్

కొరాపుట్: రాష్ట్ర చీఫ్ సెక్రటరీ మనోజ్ కుమార్ అహుజా కొరాపుట్ జిల్లాలో ఆకస్మికంగా పర్యటించారు. సోమవారం ఉదయం ప్రత్యేక విమానంలో జయపూర్‌లో దిగారు. అక్కడ కలెక్టర్ వి.కీర్తి వాసన్, ఎస్పీ రోహిత్ వర్మలు సాదర స్వాగతం పలికారు. వీరందరూ నేరుగా కొరాపుట్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ సాహిద్ లక్ష్మణ్ నాయక్ వైద్య కళాశాలని సందర్శించారు. అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులు, వైద్య వసతులు పరిశీలించారు. అనంతరం రోగులతో సెక్రటరీ మాట్లాడుతూ వారికి అందుతున్న సేవలు అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని అర్బన్ ఆస్పత్రిని సందర్శించి పనితీరుని పరిశీలించారు. చీఫ్ సెక్రటరీ పర్యటన విషయం సోమవారం ఉదయం వరకు ఎవరికీ తెలియదు. ఆయన వస్తున్నారనగానే కలెక్టర్, ఎస్పీలు తమ కార్యక్రమాలు రద్దు చేసుకుని ఆయనతోకలిసి పర్యటించారు.



జయపూర్ ఎయిర్‌పోర్టులో చీఫ్ సెక్రటరీకి స్వాగతం పలుకుతున్న ఉన్నతాధికారులు

## జిల్లా లేబర్ కార్యాలయం ఘెరావ్



జిల్లా లేబర్ కార్యాలయం ఘెరావ్ చేసిన శ్రామికులు

జయపురం: ఆల్‌ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ)నేతత్వంలో సోమవారం వందలాది మంది శ్రామికులు జయపురం లేబర్ కార్యాలయాన్ని ముట్టడించారు. స్వాతంత్ర్య యోధురాలు లక్ష్మీపండ స్మృతి కూడలి నుంచి జిల్లా లేబర్ కార్యాలయానికి వచ్చి కార్యాలయాన్ని ఘెరావ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నేతలు ప్రమోద్ కుమార్ మహంతి, జుధిష్టర్ రాళో లేబర్ అధికారికి మెమొరాండం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఉద్దేశించిన మెమొరాండంలో వివిధ పథకాల్లో పని చేస్తున్న మహిళలకు, పురుషులకు కనీస నెల వేతనం రూ.26,000 ఉండాలని, సామాజిక సురక్ష కల్పించాలని, ఈపీఎఫ్ పెన్షన్ అమలు చేయాలని, ధరలు నియంత్రించాలని, ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలు పూర్తి చేయాలని నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ, ఆశ సిబ్బందిని రెగ్యులర్ చేసి కనీస వేతనం అమలు చేయాలని కోరారు. సేవా పేపరుమిల్లు ఉద్యోగుల 8 నెలల బకాయి వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కార్మిక నేత ప్రమోద్ కుమార్ మహంతి మాట్లాడుతూ కార్మికుల హక్కులు, రక్షణ కోసం ర్యాలీ నిర్వహించామన్నారు. ఈ నెల 20 వ తేదీన అఖిల భారత స్థాయిలో ఆందోళన నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆందోళనలో వంట సహాయకుల సంఘం రాష్ట్ర కార్యవర్గ అధ్యక్షుడు ఉత్తమ మల్లిక్, కార్మిక నేత జుధిష్టర్ రాళో, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రామకృష్ణ దాస్, యువ నేత సత్యబ్రత నందో, నిర్మాణ కార్మిక సంఘ నేత సుఖు ఖిన్‌భుడి, పేపరు మిల్లు కార్మిక సంఘ కార్యదర్శి కె.సత్యనారాయణ, బసంత బెహర, త్రిపతి మఝి, అజిత్ పట్నాయిక్ తదితరులు పాల్గొన్నారు.



లేబర్ కార్యాలయాన్ని ముట్టడించిన మహిళా కార్మికులు



లేబర్ అధికారికి మెమోరాండం సమర్పిస్తున్న కార్మిక నేతలు

## కనీస వేతనాలు పెంచాలి

- అంగన్‌వాడీ, ఆశవర్కర్లు, హెల్పర్ల డిమాండ్
- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన



ర్యాలీలో అంగన్‌వాడీ, ఆశ వర్కర్లు

పర్లాకిమిడి: కనీస వేతనాలను పెంచాలని స్కీం వర్కర్లు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, మధ్యాహ్న భోజన వర్కర్లు డిమాండ్ చేశారు. 45, 46వ జాతీయ కార్మిక సమ్మేళన సిఫారసుల మేరకు కనీస వేతానాలు ప్రభుత్వం పెంచాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో కొత్త బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకూ ఆలిండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఐదో సర్వభారతీయ ప్రతిబాద్ దివాస్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో జిల్లాలోని అన్ని సమితుల నుంచి అంగన్‌వాడీ, ఆశవర్కర్లు, ఎండీఎం హెల్పర్లు, ప్యూన్లు పాల్గొన్నారు. ధరల పెరుగుదల, కనీస వేతనాల తలసరి ఆదాయం మేరకు ఇప్పుడున్న వేతనాలపై కనీసం 20 నుంచి 25 శాతం పెంచాలని ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ రంజన్ కుమార్ మహాపాత్రో కోరారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను కలెక్టర్ బిజయ కుమార్ దాస్‌కు తన చాంబర్‌లో అందజేశారు. ఏఐటీయూసీ నాయకులు ఉపేంద్రనాయక్, రాష్ట్రసంయుక్త కార్యదర్శి గీతాంజలి ఖోండో పాత్రో, మోహనా బ్లాక్ నుంచి అంగన్‌వాడీ వర్కర్ల సంఘం అధ్యక్షురాలు సంగీత నాయక్, కార్యదర్శి సుజాతా నాయక్, ఆర్.ఉదయగిరి నుంచి అధ్యక్షురాలు సస్మితా మిశ్రా, కార్యదర్శి జ్యోత్సనారాణి జెన్నా, నువాగడ బ్లాక్ నుంచి జైమన్ కర్జి, కార్యదర్శి సుస్మితా బోజోరైతో, రాయగడ బ్లాక్ నుంచి వర్కింగ్ ప్రెసిడెంటు మమతా, కార్యదర్శి నిరంజన్, గజపతి మోటారు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు నర్సింగో మాలబిశోయి, కార్యదర్శి డి.జగన్నాథరావు పాల్గొన్నారు.



ఆందోళనలో అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు



కలెక్టరేట్ మెయిన్ గేటు నిరసన ప్రదర్శన



వినతి అందజేస్తున్న దృశ్యం

## క్లుప్తంగా

### వ్యక్తి ఆత్మహత్య


రాజు మృతదేహం

మల్కన్‌గిరి: వ్యక్తి విషం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన మల్కన్‌గిరి జిల్లా కలిమెల సమితి బోడిగేట పంచాయతీ టేక్‌గూఢ గ్రామంలో సోమవారం చోటుచేసుకోగా.. రాజు మటం (25) అనే వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. రాజుకి రెండు నెలల క్రితమే కోరుకండ సమితికి యువతితో వివాహమైంది. ఇద్దరు ఎంతో అన్యోన్యంగా ఉండావరు. సోమవారం ఉదయం విషం తాగి పడిపోయి ఉన్న భర్త రాజును చూసిన భార్య కేకలు వేయడంతో స్థానికులు వచ్చి కలిమెల ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఎనిమిది గంటల సమయంలో ప్రాణాలు కోల్పోయాడు. కలిమెల పోలీసుస్టేషన్ ఐఐసీ చంద్రకాంత్ తండి ఆస్పత్రికి చేరుకొని వివరాలు సేకరించారు. కాగా తన కుమారుడు గతంలో కూడా రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు మృతుని తండ్రి పోలీసులకు తెలియజేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### యువత శ్రమదానం


దేవాలయాన్ని శుభ్రం చేస్తున్న దృశ్యం

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శ్రమదానం జరిగింది. పట్టణానికి చెందిన ఐకాన్స్ ఇన్ మెషన్ యువజన సేవా సంస్థ సభ్యులు శ్రమదానం చేసి ఆదర్శంగా నిలిచారు.ఆలయ లోపల,బయట చెత్త ఊడ్చిన అనంతరం నీటితో శుభ్రం చేశారు. ఈ సంస్థ ప్రతి నెల ఒక దేవాలయంలో ఇలా పరిశుభ్రత చేస్తున్నారు.

### నీటిడ్రమ్ములో మునిగి రెండేళ్ల బాలుడు మృతి

మల్కన్‌గిరి: నీటి డ్రమ్ములో మునిగి రెండళ్ల బాలుడు ప్రాణాలు కోల్పోయాడు. ఈ విషద ఘటన మల్కన్‌గిరి జిల్లా సమితి ఉంద్రుకొండ పంచాయతీ కెరియాగూఢ గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. మాడీ ఉంగ, దూలేమాడీ కూఢ దంపతులు. భర్త కట్టెల కోసం అటవీ ప్రాంతానికి వెళ్లగా భార్య ఇంటి వద్ద పనిలో నిమగ్నమైంది. ఇంతలో ఇంటి ఆవరణలో ఆడుతున్న రెండెళ్ల బాలుడు మాహేశ్ మాడీ అక్కడే ఉన్న నీటి డ్రమ్ములో పడిపోయాడు. అందులో నీరు ఉండడంతో ప్రాణాలు కోల్పోయాడు. తల్లి దూలే వచ్చి చూసేసరికే ప్రాణాలు పోయాయి. కలిమెల పోలీసులకు సమాచారం ఇవ్వగా.. ఐఐసీ చంద్రకాంత్ తండి వచ్చి వివరాలు సేకరించారు. మృతదేహన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మాహేశ్ మాడీ గా తేలిసింది . బాలుడి మృతదేహన్ని పోస్టుమాతం కై కలిమెల ఆరోగ్య కేంద్రం కు తరలించారు .అనంతరం మృతదేహన్ని తల్లి దాండ్రులు కు అప్పగించారు .

### పర్లాకిమిడిలో వినతుల స్వీకరణ

పర్లాకిమిడి: స్థానిక జిల్లా కలెక్టరేట్ హాల్‌లో గ్రామ ముఖి పరిపాలన, గ్రీవెన్సు సెల్‌ను సోమవారం ఉదయం ఏడు నుంచి 11 గంటల వరకూ నిర్వహించారు. స్పందన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్, అదనపు ఎస్పీ సునీల్ కుమార్ మహంతి, జెడ్పీ ముఖ్యకార్యనిర్వాహణ అధికారి శంకర్ కెరకెటా, డీఎఎఫ్‌వో కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు. జిల్లాలోని పర్లాకిమిడి తాహసిల్ పరిధిలో పర్లాకిమిడి పురపాలక సంఘం, గుసానిలో కత్తలకవిటి, కెరండీ, కాశీనగర్ సమితిలో సిద్దమణుగు, రాణిపేట గ్రామాలవాసులు వినతులు అందజేశారు. మొత్తంగా 55 వినతులు రాగా అందులో వ్యక్తిగతం 45, గ్రామసమస్యలు 10 ఉన్నాయి. వాటిలో రెండింటిని అధికారులు వెంటనే పరిష్కరించారు. స్పందన కార్యక్రమానికి పర్లాకిమిడి తహసీల్దారు నారాయణబెహెరా, సబ్ కలెక్టర్ అనుప్ పండా, గుసానిబీడీవో. గౌరచంద్ర పట్నాయిక్, ఐ.టి.డి.ఎ. అధికారి అంశుమాన్ మహాపాత్రో పాల్గొన్నారు.

# రథోత్సవానికి సన్నాహాలు

భువనేశ్వర్: జగన్నాథ యాత్ర కోసం రథాల తయారీ పనులు వేగం పుంజుకుంటున్నాయి. ఇందులో భాగంగా రథాల తయారీ పనులు చురుకుగా సాగుతున్నాయి. భారీ దూలాల్ని వడ్రంగుల మార్గదర్శకంలో అనుకూలమైన కొలతల ప్రకారం కోసి సకాలంలో అందజేస్తున్నారు. వీటితో రథ చక్రాల తుంబల తయారీ ముందుకు సాగుతుంది. రథాల తయారీ నాలుగో రోజున 38 మంది మహారణ (వడ్రంగి) సేవకులు, నలుగురు రంపం కోత కార్మికులు, ఆరుగురు కమ్మరి సేవకులు, 19 మంది భోయ్ సేవకులతో నీటి పంపిణీ కోసం ఒక సహాయకునితో 68 మంది ఈ పనుల్లో సమగ్రంగా పాలుపంచుకున్నారు. నాలుగో రోజు రథ నిర్మాణం పనులు ముగిసే సరికి మూడు రథాల కోసం మొత్తం 28 తుంబల ప్రాథమిక పనులు పూర్తి చేశారు.


రథాల తయారీలో నిమగ్నమైన కార్మికులు

**ప్రత్యక్ష పర్యవేక్షణ**

స్వామి యాత్ర కార్యకలాపాలు ఆద్యంతాలు అత్యంత జాగరూకతతో నిర్వహిస్తారు. చక్రంలో కీలక భాగమైన తుంబ తయారీలో ప్రధాన మహారణ సేవకులు ప్రత్యక్షంగా కలప నాణ్యతని లోతుగా సమీక్షిస్తున్నారు. వీరి సమీక్ష ఆధారంగా ఎంపికైన దూలాల్ని మాత్రమే రంపం కోత కార్మికులు తదుపరి తయారీ కార్యకలాపాల కోసం సిద్ధం చేస్తున్నారు.

**పనుల్లో వండ్రంగులు నిమగ్నం**

భువనేశ్వర్: జగన్నాథుని యాత్రకు రథాల తయారీ పనులు అంచెలంచెలుగా పుంజుకుంటున్నాయి. అక్షయ తృతీయ పురస్కరించుకుని ప్రారంభమైన పనులు వడ్రంగి వర్గం తొలుత చేపట్టారు. ఈ వర్గం పనులు ఒక దశకు రావడంతో అనుసంధాన కార్యకలాపాల కోసం కమ్మరి వర్గం రంగ ప్రవేశం చేసింది. శ్రీమందిరం బొడొ దండొ ప్రాంగణంలో రథాల తయారీ ఛాయా శిబిరం పని చేస్తుంది. ఈ ప్రాంగణంలో వడ్రంగి పనులు కొనసాగుతున్నాయి. కమ్మరి కార్యకలాపాల కోసం శ్రీ మందిరం పరిసరాల్లో డోల వేదిక పరిసరాల్లో తాత్కాలిక కమ్మరి శాల ఏర్పాటు చేశారు. నిత్యం ఉదయం ఎనిమిది గంటల నుంచి కార్మికులు కమ్మరి కార్యకలాపాలకు హాజరు అవుతున్నారు. మూడు రథాల ప్రధాన ఓఝూ (కమ్మరి) సేవకుల్ని ప్రత్యేకంగా సత్కరించి ఈ పనుల్ని ప్రారంభించారు. తొలి రోజున ప్రతి చక్రానికి అవసరమైన 6/7 అంగుళాల పరిమాణంతో మేకులు తయారీ పనులు ప్రారంభించారు.


రథానికి అవసరమైన మేకుల తయారీలో కమ్మర్లు


రథ చక్రాల కోసం సిద్ధమవుతున్న చువ్వలు

## బీజేడీ రాష్ట్ర కార్యవర్గంలో ప్రముఖులకు చోటు


రమేష్ చంద్ర మజ్జి


ప్రదీప్ మజ్జి


రబినారాయణ నందో


బృగు భక్షిపాత్రో


మున్నా ఖాన్

కొరాపుట్: బీజేడీ రాష్ట్ర కార్యవర్గంలో కొరాపుట్,నబరంగ్‌పూర్ జిల్లాలకు చెందిన ప్రముఖ నేతలకు చోటు దక్కింది. సోమవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు నవీన్ పట్నాయక్ ఆదేశాల మేరకు ఈ జాబితా విడుదలైంది. కొరాపుట్ జిల్లా జయపూర్‌కు చెందిన మాజీ మంత్రి రబినారాయణ నందోకి అత్యున్నత రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి దక్కంది. రబి నందో వర్గం చాలా రోజులుగా కొరాపుట్ జిల్లా అధ్యక్ష పదవి కోసం లాబీ చేస్తుండగా.. రాష్ట్ర ఉపాధ్యక్ష పదవి లభించింది. మరోవైపు రాజకీయ ప్రత్యర్థులైన మాజీ ఎంపీలు రమేష్ చంద్ర మజ్జి, ప్రదిప్ మజ్జిలకు ఎటువంటి హెచ్చుతగ్గులు లేకుండా రాష్ట్ర సీనియర్ జనరల్ సెక్రటరీ పదవులు లభించడంతో ఇరు వర్గాల్లో సమన్యాయం దక్కంది. ఒకే పార్టీలో ఉంటున్న అక్కాతమ్ములు లోపముద్ర భక్షిపాత్రో, బృగు భక్షిపాత్రోలకు పదవులు లభించాయి. బృగుకి స్టేట్ సీనియర్ జనరల్ సెక్రటరి,


ప్రభు జానీ


లోపముద్ర భక్షిపాత్రో

లోపముద్రకి స్టేట్ జనరల్ సెక్రటరి పదవులు దక్కాయి. ఇక నబరంగ్‌పూర్ జిల్లాకు చెందిన రాజ్యసభ ఎంపీ, ఒడియా సినీ హీరో మజిబుల్లా ఖాన్ (మున్నా ఖాన్)కి రాష్ట్ర మైనారిటీ సెల్ సౌత్ జోన్ సెక్రటరీ పదవులు దక్కాయి. కొరాపుట్ జిల్లా లక్ష్మీపూర్ మాజీ ఎమ్మెల్యే ప్రభుజానీకి రాష్ట్ర జనరల్ సెక్రటరి పదవి వరించింది.

## కొట్‌పాడ్ ఎమ్మెల్యే సహృదయత


స్ట్రెచర్ మోస్తున్న కొట్‌పాడ్ ఎమ్మెల్యే రుపుధర్

కొరాపుట్: రోడ్డు ప్రమాద బాధితులకు సాయం చేసి కొట్‌పాడ్ ఎమ్మెల్యే సహృదయత చాటుకున్నారు. సోమవారం కొట్‌పాడ్ ఎమ్మెల్యే రుపుధర్ బోత్ర కుంద్రా సమితి వైపు వెళ్తున్నారు. ఇదే మార్గంలో బిజ్జిగుడ-బలియాల మధ్య ఒక బైక్ ప్రమాదానికి గురైంది. ఇద్దరు క్షతగాత్రులు రోడ్డు పక్కన పడి ఉన్నారు. ఇది చూసిన ఎమ్మెల్యే వెంటనే తన కారు దిగి అంబులెన్స్‌ను పిలిపించారు. క్షతగాత్రులను స్ట్రెచర్ మోసుకుంటూ వెళ్లి వాహనం ఎక్కించారు. వారు ఆస్పత్రికి చేరేంత వరకు పరిస్థితి సమీక్షించారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు


వినతిపత్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ పటేల్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. 21 వినతులను స్వయంగా కలెక్టర్ స్వీకరించారు . జిల్లా కేంద్రంలో పరిసర గ్రామాలకు చెందిన పలు సమస్యలపై వినతులు అందజేశారు. కలెక్టర్ ఆశీష్ ఈశ్వర్ మాట్లాడుతూ, జిల్లా వాసుల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ మేరకు అన్ని శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఏయే గ్రామాల్లో సమస్యలు ఉన్నాయో అక్కడికి వెళ్లి పరిశీలించి, వాటి పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వేలవి కాలం నీటి సమస్య ఎక్కువగా ఉందని, దీనిపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎస్పీ వినోద్ కుమార్ పటేల్, జిల్లా అదనపు కలెక్టర్ వేద్బర్ ప్రదాన్, జిల్లా సబ్ కలెక్టర్ దుర్యోధన్ బోయి, జిల్లా అభివృద్ధి శాఖ అధికారి నరేశ్ చంద్ర శభరో, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పోలీస్ వాహనాన్ని ఢీకొట్టిన ఆటో


చికిత్స పొందుతున్న జీడి కార్మికురాలు


దెబ్బతిన్న పోలీసు వాహనం


చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్

కొరాపుట్: పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని ఆటో ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటోలో ఉన్న ఆరుగురు కార్మికులు గాయపడ్డారు. జయపూర్ పట్టణంలోని తెలిగుడ వద్ద కెనాల్ మార్గంలో జీడి పరిశ్రమ కార్మికులతో వెళ్తున్న ఆటో మలుపు వద్ద పోలీస్ పెట్రోలింగ్ వాహనాన్ని ఢీకొట్టడంతో ప్రమాదం జరిగింది. గాయపడిన అరుగురు కార్మికులను పోలీసు వాహనంలో జయపూర్‌లోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు. ప్రమాదంలో పోలీసు వాహన డ్రైవర్‌కి కూడా గాయాలయ్యాయి.

## జగదల్‌పూర్‌లో ల్యాండ్‌మైన్స్ గుర్తింపు



జగదల్‌పూర్ అటవీ ప్రాంతంలో గుర్తించిన బాంబులు


బాంబులు పేల్చివేసిన దృశ్యం

రాయగడ: మావోయిస్టు ప్రభావిత ప్రాంతమైన మునిగుడ సమితి అంబొదల పంచాయతీలోని జగదల్‌పూర్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన ల్యాండ్‌మైన్స్‌ను సోమవారం గుర్తించారు. డిస్ట్రిట్ వలంటరీ ఫోర్స్ (డీవీఎఫ్), సీఆర్పీఎఫ్ నాల్గో బెటాలియన్ లకు చెందిన ప్రత్యేక దళం ఈ మేరకు మావోయిస్టులు అమర్చిన 4 ల్యాండ్‌మైన్స్ (బాంబులు)లను గుర్తించినట్లు ఎస్పీ స్వాతి ఎస్.కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా ఇంటెలిజెన్స్ ఫోర్స్ వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు జగదల్‌పూర్ అటవీ ప్రాంతంలో ప్రత్యేక పోలీస్ దళాలు సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న సమయంలో మావోయిస్టులు అమర్చిన కుక్కర్ బాంబ్, మరో మూడు టిఫిన్ బాంబులను గుర్తించినట్లు పేర్కొన్నారు. వాటిని గుర్తించిన పోలీసు ప్రత్యేక దళం సురక్షిత ప్రాంతంలో నిర్వీర్యం చేసిందని తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ స్వాతి

## • చందన యాత్ర


పూరీ జగన్నాథుని చందన యాత్ర అత్యంత ఆనందోత్సాహాలతో జరుగుతోంది. యాత్ర వైభవం పవిత్ర నరేంద్ర సరోవరంలో నిత్యం ప్రతిబింబిస్తుంది. మదన మోహనుడు ఉభయ దేవేరులతో పల్లకిలో సరోవరం తీరానికి విచ్చేయడంతో చందనోత్సవం తళుక్కుమంటుంది.

\- భువనేశ్వర్

## రూ. 6 కోట్లతో పపడాహండి అభివృద్ధి


వేదికపై మంత్రి నిత్యానంద, ఎమ్మెల్యేలు గౌరీ శంకర్, మనోహర్, మాజీ ఎంపీ పరశురాం మజ్జి, మున్నా త్రిపాఠి

కొరాపుట్: రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన రూ.6 కోట్లతో నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి టురి నది ఒడ్డున, జాతీయ రహదారి పక్కన సమరయోధుల ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని రాష్ట్ర గిరిజన, సాంఘిక సంక్షేమ, మైనారిటీ, ప్రాథమిక విద్యాశాఖా మంత్రి నిత్యానంద గొండో ప్రకటించారు. సోమవారం పపడాహండిలో జరిగిన అఖిల పక్ష సమావేశంలో ఈ నిధులతో ప్రభుత్వం చేపడుతున్న పనుల గూర్చి వివరించారు. 1942 ఆగస్టు 24న బ్రిటిష్ వారి తుపాకీ తూటాలకు 26 మంది స్వాతంత్ర్య సమరయోధులు బలైన విషయం గుర్తు చేశారు. నాటి బలిదానాకికి గుర్తుగా అక్కడ భారీ స్థూపం ఉందన్నారు. ఇప్పుడు ఈ నిధులతో అక్కడ పరిశోధన కేంద్రం, పార్క్, మీటింగ్ హాల్, మ్యూజియం ఏర్పాటు చేస్తామని మంత్రి ప్రకటించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు మనోహర్ రంధారి, గౌరీ శంకర్ మజ్జి, మాజీ ఎంపీ పరశురాం మజ్జి, మున్నా త్రిపాఠి, తదితరులు పాల్గొన్నారు.


హాజరైన ప్రజాప్రతినిధులు, స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబ సభ్యులు

# మిగులు కలప దుర్వినియోగం కాలేదు: మంత్రి

భువనేశ్వర్: పశ్చిమ బెంగాల్ దిఘా జగన్నాథ ఆలయం ప్రాణ ప్రతిష్ట మహోత్సవం పురస్కరించుకుని తలెత్తిన ద్వంద్వ వైఖరి పరిస్థితి రాష్ట్రంలో తీవ్ర కలకలం రేపిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో దర్యాప్తు చేపట్టి నివేదిక దాఖలు చేయాలని రాష్ట్ర న్యాయ శాఖ శ్రీ మందిరం అధికార వర్గానికి ఆదేశించింది. ఈ ప్రక్రియ ప్రాథమిక దశ ముగిసింది. మధ్యంతర నివేదిక న్యాయ శాఖకు చేరింది. నవ కళేబరం మిగులు కలప దుర్వినియోగం కాలేదని నివేదిక స్పష్టం చేసిందని మంత్రి వివరించారు. మధ్యంతర నివేదిక పూర్తి వివరాల్ని విభాగం మంత్రి మీడియాకు తెలియజేశారు.

శ్రీ మందిరం ప్రధాన పాలన అధికారి సీఏఓ, న్యాయ శాఖ ప్రముఖ కార్యదర్శి సంయుక్తంగా మధ్యంతర నివేదిక దాఖలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ నివేదిక నిర్దిష్టమైన మార్గదర్శకాల్ని పేర్కొంది. ముఖ్యమంత్రి ఆమోదం మేరకు వీటి వాస్తవ కార్యాచరణ అమలు ఖరారు చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. పశ్చిమ బెంగాలు దిఘా ప్రాంతంలో ఆలయానికి జగన్నాథ్ ధామ్‌గా పేర్కొనడంపై సర్వత్రా విచారం వ్యక్తమైందని, ధామ్ పద ప్రయోగం ఆమోద యోగ్యం కాదని కేవలం చతుర్థామ క్షేత్రాలకు మాత్రమే పరిమితమని సర్వత్రా ఏకాభిప్రాయం వ్యక్తం అయిందని పేర్కొన్నారు. ఈ వ్యవహారాన్ని పశ్చిమ బెంగాలు సర్కారు విరమించుకోవాలని సంయుక్త నివేదిక సిఫారసు చేసింది.


విలేకర్ల సమావేశంలో రాష్ట్ర న్యాయ శాఖ మంత్రి పృథ్వి రాజ్ హరిచందన్.

దిఘా ఆలయం నామకరణం, సముద్రానికి మహోదధి వ్యవహారంలో దిఘా పదం తొలగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పశ్చిమ బెంగాలు రాష్ట్ర ప్రభుత్వంతో ప్రత్యక్షంగా సంప్రదింపులు జరుపుతుంది. సానుకూలంగా స్పందించకుంటే న్యాయపరమైన చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం వెనుకాడబోదని మంత్రి స్పష్టం చేశారు.

**సేవకులకు క్రమశిక్షణ మార్గదర్శకాలు**

పూరీ శ్రీ మందిరంలో సేవాదుల్లో పాలుపంచుకుంటున్న సేవాయత్‌లు శ్రీ మందిరేతర దేవస్థానాల కార్యకలాపాల్లో పాలుపంచుకోవడంలో ప్రత్యేక మార్గదర్శకాలు తక్షణమే అమలు చేయాలి. ఈ చర్యతో సేవాయత్‌లో క్రమశిక్షణ తేటతెల్లమై పారదర్శకంగా వివాదరహిత ప్రవర్తనని పటిష్టపరుస్తుంది. ముక్తి మండపం పండిత్ సభ ఆధ్వర్యంలో నిర్దిష్టమైన కార్యాచరణ ఎస్‌ఓపీ రూపకల్పనకు నివేదిక సూచించింది. పూరీ శ్రీ జగన్నాథుని నవ కళేబరం మిగులు వేప చెక్కలు పశ్చిమ బెంగాలు దిఘా ఆలయంలో మూల విరాట్ల తయారీలో వినియోగించిన అంశం పొరపాటున ప్రసారం అయినట్లు దర్యాప్తు బృందం తేల్చింది. మహరణ (వడ్రంగి) సేవకులతో సంప్రదించిన మేరకు ఈ విషయం స్పష్టం అయింది. వీరి వివరణ ప్రకారం నవ కళేబరం మిగులు వేప కలపతో 2.5 అడుగుల విగ్రహాల తయారీ ఎంత మాత్రం సాధ్యం కాదు. అలాగే పశ్చిమ బెంగాలు దిఘా ఆలయానికి అవసరమైన మూల విరాటుల్ని వేరొక వడ్రంగి ఆధ్వర్యంలో తయారు చేయించి తరలించారు. దీని తయారీలో పూరీ శ్రీ జగన్నాథునికి సంబంధించిన దారు ఏ మాత్రం వినియోగించడం జరగలేదని స్పష్టం చేశారు.

**దారు గృహంలో పదిలం**

పూరీ శ్రీ జగన్నాథుని మూల విరాటుల తయారీ తర్వాత మిగులు దారు (వేప కలప) భద్రపరిచేందుకు ప్రత్యేకంగా కేటాయించిన దారు గృహంలో యథాతథంగా పదిలపరచాలని దర్యాప్తు బృందం ఉద్ఘాటించింది. సత్య లిపి ప్రకారం స్వామి దారు విగ్రహాల మిగులు దారు (వేప కలప) సువార్ మహా సువార్ నియోగుల గృహానికి ఆనుకుని ఉన్న దారు గృహంలో పదిలపరచాల్సి ఉంది. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం 1995 - 96 సంవత్సరంలో చోటు చేసుకున్న పొరబాటు కారణంగా తాజా వివాదం తీవ్ర కలకలం రేపిందని మంత్రి తెలిపారు. ప్రభుత్వ నిర్ణయం ప్రకారం మిగులు కలపలో కొంత భాగం దైతపతి నియోగుల గృహంలో ఉంచేందుకు అనుమతించారు. దీని ఆధారంగా శ్రీ మందిరం మిగులు వేప కలప దుర్వినియోగం అయిందనే ఆరోపణ తీవ్ర దుమారం రేపింది. ఈ పరిస్థితి పునరావృతం కాకుండా సత్య లిపి ప్రకారం మిగులు వేప కలప దారు గృ హంలో యథాతథంగా పదిల పరచాలని దర్యాప్తు బృందం సిఫారసు చేసింది. ఐదుగురు సభ్యుల కమిటీ పర్యవేక్షణలో మిగిలి ఉన్న వేప కలపని లెక్కించి ఒక చోట పోగు చేసి భద్రపరుస్తారు. ప్రస్తుతం దారు గృహంలో కొంత, దైతపతి గృహంలో కొంత మిగులు కలప ఉంది. ఈ రెండింటిని ఒక చోట కూడగట్టి కమిటీ సభ్యుల సమక్షంలో లెక్కించి దారు గృహంలో భద్రపరచనున్నారు.

**నోరు జారి పొరపాటు దొర్లింది**

దిఘా ఆలయంలో మూల విరాటుల తయారీకి సంబంధించి నోరు జారి పొరపాటు దొర్లిందని వివాదాల్లో చిక్కుకున్న దైతపతి సేవాయత్ రామకృష్ణ దాస్‌మహాపాత్రో వివరణ దాఖలు చేశారు. ఈ మేరకు లిఖితపూర్వంగా విచారణ బృందానికి విన్నవించారు.

## జమిలి ఎన్నికలతో ప్రజాధనం వృథా కాదు



మాట్లాడుతున్న కుంజదాస్

కొరాపుట్: జమిలి ఎన్నికలతో ప్రజా ధనం వృథా కాదని నబరంగ్‌పూర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు కుంజ బీహారి దాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన వన్ నేషన్-వన్ ఎలక్షన్ అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ విధానం అమలైతే మధ్యంతర ఎన్నికలు రావన్నారు. పదే పదే ఎన్నికల కోడ్ వలన ప్రజా పాలనకు అడ్డంకి అవుతుందని గుర్తు చేశారు. ఒకే సారి ఎన్నికలతో దేశ వ్యాప్తంగా ఐదేళ్ల పాటు రాజకీయాలు ఉండవని కుంజదాస్ పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ పరిశీలకులు సౌమ్యకాంత్ జెన్నా, రాజేష్ కుమార్ పట్నాయక్, చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ కను దాస్, పార్టీ నాయకులు మృత్యుంజయ్ దాస్, దేవదాస్ మహాంకుడో, జగదీష్ బిసోయి ఉన్నారు.


హాజరైన బీజేపీ కార్యకర్తలు

# ఆస్తమా..అలక్ష్యం..అంతే..!

- జిల్లాలో నెలకు 800 నుంచి 1000 వరకు కేసుల నమోదు
- సకాలంలో చికిత్స చేసుకోకపోతే మృత్యువాత పడే ప్రమాదం
- నేడు ప్రపంచ ఆస్తమా దినోత్సవం


సర్వజన ఆస్పత్రిలో ఆస్తమా లక్షణాలు ఉన్న రోగిని పరీక్షిస్తున్న వైద్యుడు

విజయనగరం ఫోర్ట్: ఆస్తమా (ఉబ్బసం) వ్యాధి పిల్లలతో పాటు పెద్దలకు వ్యాప్తి చెందుతుంది. వ్యాధి పట్ల అలసత్వం వహిస్తే మృత్యువాత పడే ప్రమాదం ఉంది. జన్యుపరంగా వ్యాధి వ్యాప్తి చెందుతుంది. అయితే పొగతాగేవారికి ఆస్తమా ఉంటే వ్యాధి మరింత తీవ్రమవుతుంది. మంగళవారం ప్రపంచ ఆస్తమా దినోత్సవం సందర్భంగా సాక్షి అందిస్తున్న ప్రత్యేక కథనం. ఆస్తమా బాల్యదశలో కూడా చిన్నారులకు వ్యాప్తి చెందుతుంది. దీన్ని వాడుక భాషలో పాల ఉబ్బస అంటారు. ఈ వ్యాధి సోకితే మనిషిని కుదురుగా ఉండనీయదు. ముఖ్యంగా చలికాలంలో ఈవ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. వేసవిలో కాస్త ప్రశాంతంగా ఉంటారు. వేసవిలో కూడా ఆస్తమా ఉన్నవారు చల్లటి నీరు తాగితే వ్యాధి తీవ్రం అవుతుంది.

**సైనసైటిస్, ఇస్నోఫిలీయో ఆస్తమాగా మార్పు**

సైనసైటిస్, ఇస్నోఫిలియో, ఫుడ్‌ఎలర్జీ, డస్ట్‌ఎలర్జీ క్రమేణా ఆస్తమాగా మారుతాయి. ఈ సమస్యలు ఉన్నవారు జాగ్రత్తలు పాటిస్తే ఆస్తమా బారిన పడకుండా ఉంటారు. నిర్లక్ష్యం చేస్తే వ్యాధి బారిన పడతారు. చలికాలంలో వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటుంది. కాబట్టి చలికాలంలో అత్యంత జాగ్రత్తగా ఉండాలి.

**జిల్లాలో 800 నుంచి 1000 కేసుల నమోదు**

జిల్లా వ్యాప్తంగా నెలలో 800 నుంచి 1000 వరకు కేసులు నమోదవుతున్నాయి. సర్వజన ఆస్పత్రిలో నెలకు 200 నుంచి 300 మంది ఆస్తమా రోగులు చికిత్స కోసం వస్తున్నారు.

### సొంతంగా మందులు వాడకూడదు



ఆస్తమా లక్షణాలు ఉన్న వారు మెడికల్ షాపుల్లోను, ఆర్‌ఎంపీల వద్ద మందులు కొనుగోలు చేసి వేసుకుంటారు. ఇలా చేయడం వల్ల తాత్కాలికంగా తగ్గినప్పటికీ వ్యాధి తీవ్రమవుతుంది. ఆస్తమా లక్షణాలు కనిపించిన వెంటనే దగ్గరలో ఉన్న పలమనాలజిస్టును సంప్రదించి చికిత్స చేయించుకోవాలి. ఇన్‌హేలర్స్ వాడడం ద్వారా వ్యాధి అదుపులోకి వస్తుంది. – డాక్టర్ బొత్స సంతోష్‌కుమార్, పలమనాలజిస్ట్, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి

**వ్యాధి లక్షణాలు**

- ఆయాసంగా ఉండడం
- పిల్లికూతలు రావడం
- చాతీ భారంగా ఉండడం
- కఫం ఎక్కువగా ఊరుతుండడం
- ఊబకాయం వల్ల కూడా అస్తమా వస్తుంది
- గర్భిణుల్లోనూ ఆస్తమా వచ్చే అవకాశం
- వ్యాధి తీవ్రమైతే మృత్యువాతపడే ఆస్కారం
- వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే పలమనాలజిస్టును కలిసి చికిత్స చేయించుకోవాలి. వ్యాధి తీవ్రమైతే శ్వాసవ్యవస్థ ఆగిపోయి చనిపోయే ప్రమాదం ఉంది. ప్రపంచ ఆరోగ్య వ్యవస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) గణాంకాల ప్రకారం రోజుకు 100మంది ఆస్తమాతో ప్రాణాలు వదులుతున్నారు.

## కొరియా సమస్యపై ముఖ్యమంత్రి,గవర్నర్లతో మాట్లాడాలి

- రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌కు వినతిపత్రం


రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకర్రావుకు వినతిపత్రం అందజేసిన పోరవేదిక అధ్యక్షుడు భీశెట్టి, సభ్యులు

విజయనగరం గంటస్తంభం: ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దు గ్రామాలైన వివాదాస్పద కొఠియా గిరిజనులను ఒడిశా అధికారులు, పోలీసులు ఇబ్బందులు పెడుతున్న తీరుపై ఆంధ్రప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల గవర్నర్లతోను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడితో మాట్లాడి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలి. ఈ మేరకు రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకర్రావును విజయనగరం జిల్లా పోరవేదిక అధ్యక్షుడు భీశెట్టి బాబ్జీ కోరారు. ఈ సందర్భంగా సోమవారం జిల్లా పరిషత్ అతిథిగృహంలో చైర్మన్‌తో సమావేశమై కొఠియా వివాదాస్పద గ్రామాల్లో జరుగుతున్న పరిణామాలపై చర్చించారు. గడిచిన 55 సంవత్సరాలుగా రెండు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల్లో 21గ్రామాల్లో 6 పంచాయతీల్లో వివాదం ఉందని వివరించారు. కార్యక్రమంలో పోరవేదిక ప్రతినిధులు పిడకల ప్రభాకరరావు, తాడేపల్లి నాగేశ్వరరావు, తుమ్మగంటి రామ్మోహన్ రావు, థాట్రాజు రాజారావు, తిరుపతిరావు, గోపాలరావు, ప్రధాన కార్యదర్శి జలంత్రి రామచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

## పట్టాలు ఇప్పించండి సారూ..!


కలెక్టరేట్ వద్ద సమస్యను తెలుపుతున్న గ్రామస్తులు

పార్వతీపురంటౌన్: గడిచిన 60ఏళ్లుగా చేస్తున్న వ్యవసాయ భూములకు సంబంధించి పట్టాలు ఇప్పించాలని వీరఘట్టం మండలం శాంతిగూడ, గదబవలస, జడగూడ, సింధునగరం, పెద్దూరు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలియజేసి డీఆర్‌ఓ హేమలతకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ తమ పూర్వీకులనుంచి వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని, ఫారెస్టు అధికారులు తమ భూములు ఖాళీ చేయాలని చెబుతున్నారని వాపోయారు. ప్రభుత్వం తమపై దయఉంచి ఈ భూములకు సంబంధించి పోడు పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### నేడు ఈసెట్, ఐసెట్ రేపు

విజయనగరం అర్బన్: జిల్లాలో ఏపీ ఈసెట్ -2025 ప్రవేశ పరీక్ష మంగళవారం జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న 2,184 మంది అభ్యర్థుల కోసం ఐదు కేంద్రాల్లో ఈ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేశారు. రాజాం జీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాల, సీతం ఇంజినీరింగ్ కళాశాల, లెండి ఇంజినీరింగ్ కళాశాల, అంతి ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం , మధ్యాహ్నం రెండు షిఫ్టుల్లో పరీక్ష నిర్వహిస్తారు. అలాగే ఈ నెల 7వ తేదీన ఏపీ ఐసెట్ -2025 ప్రవేశ పరీక్షను నిర్వహించడానికి జిల్లాలోని మూడు కేంద్రాల్లో ఏర్పాట్లు చేశారు. జిల్లాలో ఈ పరీక్ష రాస్తున్న 1,548 మంది అభ్యర్థుల కోసం రాజాం జీఎంఆర్ ఇంజినీరింగ్ కళాశాల, గాజులరేగ ఐయాన్ డిజిటల్ జోన్, ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం, మధ్యాహ్నం షిఫ్టులుగా ఈ పరీక్ష జరుగుతుంది.

### విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత


ఉదయ్ కిరణ్‌కు ల్యాప్‌టాప్ అందజేస్తున్న ప్రత్యేక ఉప కలెక్టర్ డా. పి.ధర్మారెడ్డి

పార్వతీపురంటౌన్: సాలూరు మండలం, శివరాంపురం గ్రామానికి చెందిన విభిన్న ప్రతిభావంతుడు అల్లు.ఉదయ్ కిరణ్‌కు వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా సుమారు రూ: 33 వేల విలువైన ల్యాప్‌టాప్‌ను ప్రత్యేక ఉప కలెక్టర్ డా.పి.ధర్మారెడ్డి సోమవారం పీజీఆర్ఎస్. సమావేశ మందిరంలో అందజేశారు. కడప జిల్లా డా.వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్, ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీలో మూడవ సంవత్సరం పెయింటింగ్‌లో డిగ్రీ చదువుతున్న ఉదయ్‌కిరణ్ మూగ, చెవుడుతో బాధపడుతూ విద్యనభ్యసిస్తున్నాడు. తన చదువుకు, ఉపాధికి ల్యాప్‌టాప్ మంజూరు చేయాలని కోరగా, ఆ విద్యార్థికి సోమవారం ల్యాప్‌టాప్‌ను అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, కలెక్టరేట్ సూపరింటెండెంట్ శ్రీరామమూర్తి, వికలాంగుల సంక్షేమ శాఖ సీనియర్ అసిస్టెంట్ రమణ తదితరులు పాల్గొన్నారు.

### గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

భోగాపురం: భోగాపురం జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని సోమవారం ఉదయం ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటనపై పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భోగాపురం గ్రామానికి చెందిన దుబ్బక సంతోష్ (37) వ్యవసాయ పనులు చేసుకుంటు కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం వేకువ జామున జాతీయ రహదారి పక్కనే ఉన్న పొలానికి వెళ్లాడు. బహిర్భూమికని చెప్పి పొలంలో నుంచి జాతీయ రహదారికి అవతలి వైపు వెళ్లెందుకు రోడ్డు దాటుతుండగా విశాఖపట్నం నుంచి శ్రీకాకుళం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో డివైడర్‌పై ఉన్న మొక్కల పొదల్లో పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి తండ్రి అప్పన్న, తల్లి ఈశ్వరమ్మ ఉన్నారు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుని తండ్రి అప్పన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సూర్యకుమారి తెలిపారు.

### రెండు పూరిళ్లు దగ్ధం

గరుగుబిల్లి: మండలంలోని ఉల్లిభద్రలో సోమవారం మధ్యాహ్నం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు పూరిళ్లు దగ్ధమయ్యాయి. గ్రామానికి చెందిన జక్కువ కంచమ్మ, ముదుదాపు నాగభూషణకు చెందిన పూరిళ్లు కాలిపోయాయి. ప్రమాదం జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ఈ ప్రమాదంలో ఇంట్లో ఉన్న విలువైన సామగ్రి అగ్నికి ఆహుతైంది. కట్టుబట్టలతో బాధితులు అగ్నిప్రమాదం నుంచి బయటపడ్డారు. ఈ మేరకు సమాచారం తెలుసుకున్న వీఆర్‌ఓ శ్రీనివాసరావు ఘటనా స్థలానికి చేరుకుని అగ్నిప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకుని నివేదికను తహసీల్దార్‌కు సమర్పించారు.

### మూగజీవాల సంరక్షణకు సమష్టిగా కృషి చేయాలి

చీపురుపల్లి: మూగజీవాల సంరక్షణకు సమష్టిగా కృషి చేయాలని ఆర్‌డీఓ జీవీ.సత్యవాణి అన్నారు. ఈ మేరకు స్థానిక ఆర్‌డీఓ కార్యాలయంలో సోమవారం సాయంత్రం డివిజన్ స్థాయి జంతు సంక్షేమ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంతు సంక్షేమ చట్టం ప్రకారం పశువుల అక్రమ రవాణా చేయకూడదని హితవు పలికారు. అక్రమ రవాణా, జంతుబలులు తదితర సంఘటనలు జరగకుండా సంబంధిత శాఖల నేతృత్వంలో పర్యవేక్షణ పెంచాలని స్పష్టం చేశారు. దేవాలయాలకు రెండు వందల మీటర్ల సమీపంలో ఎలాంటి జంతుబలులు జరగకూడదని చెప్పారు. పశువుల అక్రమ రవాణాపై పోలీస్ శాఖ పటిష్ట నిఘా అమలు చేయాలని సూచించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య ముద్రించిన క్యాలెండర్లను ఆవిష్కరించారు. డీఎస్పీ ఎస్.రాఘవులు, సీఐ జి.శంకరరావు, ఎ.డి ఆర్.శారద, రాజాం మున్సిపల్ కమిషనర్ జె.రాములప్పనాయుడు, అధికారులు పాల్గొన్నారు.

## 23.400 కేజీల గంజాయి పట్టివేత


కొత్తవలస: పట్టుబడిన గంజాయి, నిందితులను చూపిస్తున్న సీఐ షణ్ముఖరావు, ఎస్సై మన్మథరావు


పాచిపెంట: స్వాధీనం చేసుకున్న గంజాయితో సీఐ రామకృష్ణ, ఎస్సై వెంకట సురేష్

కొత్తవలస: ఒడిశా రాష్ట్రం నుంచి అరకు, విశాఖపట్నం మీదుగా హైదరాబాద్‌కు కారులో 23 కేజీల, 400 గ్రాముల గంజాయి తరలిస్తుండగా కొత్తవలస పోలీసులు మండలంలోని మంగళపాలెం జంక్షన్ సమీపంలో సోమవారం పట్టుకున్నారు. దీనికి సంబంధించి సీఐ షణ్ముఖరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గంజాయి కారులో తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్సై మన్మథరావు తన సిబ్బందితో మంగళపాలెం జంక్షన్ వద్ద మాటు వేశారు. దీంతో ముందుగా పల్సర్ బండిపై ఒక వ్యక్తి వెళ్తుండగా పోలీసులు అనుమానం వచ్చి ఆపగా బైక్ అక్కడే వదిలేసి తప్పించుకుని పారిపోయాడు. ఈ దృశ్యాన్ని వెనుక ఫిఫ్ట్ డిజైర్ కారులో వస్తున్న వారు గమనించి కారు ఆపి పారిపోయేందుకు ప్రయత్నించగా అనుమానం వచ్చిన పోలీసులు కారులో గల ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని తనిఖీ చేసి గంజాయి ఉన్నట్లు గుర్తించారు. కారు నాలుగు డోర్ల పై కవర్లు విప్పి అందులో 23 కేజీల,4వందల గ్రాముల గంజాయిని 48 ప్యాకెట్లుగా విభజించి దాచి యథావిధిగా డోర్స్ కవర్లు వేసి ఉండడం గమనించారు. దీంతో నిందితులను, కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించి తహసీల్దార్ బి.నీలకంఠరావు సమక్షంలో కారు డోర్లు తెరిచి అందులో గల గంజాయిని వెలుపలకు తీశారు. శ్రీకాకుళం జిల్లా రేగిడి ఆముదాలవలస మండలం పెద్దచెర్ల గ్రామానికి చెందిన పాలవలస జనార్దన్, పాలవలస రాంబాబులుగా నిందితులను గుర్తించారు. వారిని విచారణ చేయగా ఒడిశా రాష్ట్రంలో కొనుగోలు చేసి హైద్రాబాద్‌కు కారులో తరలిస్తున్నట్లు అంగీకరించారు. నిందితులను అరెస్టు చేసి స్థానిక కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు సీఐ వివరించారు.

**పాచిపెంటలో 127 కేజీలు..**

పాచిపెంట: కారులో అక్రమంగా తరలిస్తున్న 127 కేజీల గంజాయిని పాచిపెంట పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు సాలూరు రూరల్ సీఐ రామ కృష్ణ సోమవారం పాచిపెంట పోలీస్‌స్టేషన్‌లో విలేకరులకు వెల్లడించారు. మండలంలోని పద్మాపురం జంక్షన్‌లో సోమవారం మధ్యాహ్నం అనుమానస్పదంగా ఓ కారు ఆగి ఉండడాన్ని గమనించిన స్థానిక వీఆర్వో పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై వెంకట సురేష్ సిబ్బందితో వెళ్లి కారును పరిశీలించి, అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించి స్థానిక రెవెన్యూ అధికారుల సమక్షంలో తూనిక వేసి స్వాధీనం చేసకుని కేసు నమోదు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

### ప్రైవేటు పాఠశాలల సమస్యలపై వినతి

బొండపల్లి: ప్రైవేటు పాఠశాలల సమస్యలను త్వరగా పరిష్కరించాలని కోరుతూ ఏపీ ప్రైవే టు స్కూళ్ల యాజమాన్యం సంఘం (అప్సా) ఆధ్వర్యంలో గజపతినగరం నియోజకవర్గ ప్రైవేటు స్కూళ్ల యాజమాన్య ప్రతినిధులు ఎంఈఓ శోభారాణి, ఎంఈఓ-2 అల్లు వెంకటరమణకి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫారం- 1 లో ప్రైవేటు స్కూళ్లకు సంబంధించిన అన్ని వివరాలను ఆన్‌లైన్ చేయాలని ప్రభుత్వం నిబంధన విధించిందని, ఈ నిర్ణయం వల్ల స్కూళ్ల యాజమాన్యానికి తీవ్ర సమస్యలు వస్తున్నాయని చెప్పారు. ఈనిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఇప్పటికే విద్యాశాఖ మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశామని గుర్తు చేశారు. ప్రభుత్వంతో చర్చలు కూడా జరుగుతున్నాయ ని తెలిపారు.

### అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి


మృతిచెందిన రమణమ్మ

సీతానగరం: మండలంలోని బల్లకృష్ణాపురం గ్రామంలో సోమవారం ఉదయం బొత్స రమణమ్మ (75) అనే వృద్ధురాలు అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. దీనిపై పార్వతీపురం సీఐ గోవిందరావు తెలిపిన వివరాల ప్రకారం రమణమ్మ గ్రామంలోని తన నివాసంలో గెద్దలుప్పి గ్రామానికి చెందిన తన కుమార్తె సొంగల లక్ష్మితో కలిసి ఉంటోంది. ఆదివారం రాత్రి ఎలుకలు, చిన్న ఇల్లు అని వేరొకరి ఇంట్లో నిద్రించడానికి మృతురాలి కుమార్తె వెళ్లింది. ఆ రాత్రి ఇంట్లో ఒంటరిగా రమణమ్మ నిద్రించింది. సోమవారం తెల్లవారుజామున లక్ష్మి ఇంటికి వచ్చి తల్లి రమణమ్మను లేపేందుకు చూడగా విగతజీవిగా పడి ఉండడం గమనించి భోరున కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి గ్రహించారు. రమణమ్మకు మెడనొప్పి నివారణ కోసం మెడకు బెల్టు కట్టుకుని నిద్రించే అలవాటు ఉంది. తన తల్లిది సాధారణ మరణం అని కుమార్తె లక్ష్మి తొలుత భావించింది. అయితే మృతురాలిపై చీర వేయడం నిమిత్తం ఇంట్లో ఉన్న బీరువా దగ్గరికి వెళ్లి తెరవగానే అందులో ఉండాల్సిన బంగారు ఆభరణాలు, డబ్బులు కనిపించక పోవడంతో ఆందోళన చెందింది. తమ ఇంట్లో దొంగలు పడి బంగారం ఆభరణాలు డబ్బులు చోరీ చేసి తల్లిని హత్య చేసి ఉంటారనే అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో సంఘటనాస్థలానికి సీఐ గోవిందరావు ఆధ్వర్యంలో ఇన్‌చార్జ్ ఎస్సై నీలకంఠం, సిబ్బంది చేరుకుని క్లూస్‌టీమ్, గాగ్‌స్క్వాడ్ సహాయంతో ఆధారాలు సేకరించి కేసునమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. రమణమ్మ మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా కేంద్రాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతురాలి ఇద్దరు కుమారులు విశాఖపట్నం, హైదరాబాద్‌లో ఉంటారు.

క్షణాల్లో చుట్టుముట్టిన అగ్నికీలలు... ఇద్దరిని సజీవంగా దహనం చేశాయి. కాపాడాలన్న వారి ఆర్తనాదాలు విన్నవారు పరుగెత్తినా.. దగ్గరకు రాకుండా భయపెట్టాయి. కళ్లముందరే బూడిదగా మార్చాయి. లారీలో ఇరుక్కుపోయి ఒకరు.. పూరి గుడిసెలో మరొకరు ప్రాణాలు విడిచారు. జిల్లాలో వేర్వేరు చోట్ల సోమవారం జరిగిన ఈ ప్రమాదాలు చూసేవారిలో కన్నీరు తెప్పించాయి. కుటుంబ సభ్యులకు శోకాన్ని మిగిల్చాయి.


ప్రమాదంలో సజీవదహనమైన డ్రైవర్ బసుదేబ్ సికిధర్ (ఫైల్)


కాలిపోతున్న లారీ

## కళ్లముందే ఘోరం

- అగ్నిమంటల్లో ఇద్దరు సజీవదహనం
- అగ్నిని ఆర్పేలోపే గాలిలో కలిసిన ప్రాణాలు
- కన్నీరుమున్నీరవుతున్న కుటుంబ సభ్యులు

**పశ్చిమబెంగాల్ నుంచి విశాఖపట్నం వెళ్తూ...**

డెంకాడ: వందల కిలోమీటర్ల దూరం ప్రయాణించాడు. మరో గంట ప్రయాణిస్తే చాలు ఆ లారీ డ్రైవర్ విశాఖపట్నంలోని గమ్యస్థానానికి చేరుకుంటాడు. ఇంతలో మృత్యువు వెంటాడింది. డెంకాడ మండలం నాతవలస టోల్‌గేట్ వద్ద జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ దగ్ధంకాగా, అందులో ఉన్న డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. ఎస్‌ఐ ఎ.సన్యాసినాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం మధ్యాహ్న సమయంలో జ్యూట్ గోనెల లోడ్‌తో పశ్చిమ బెంగాల్ రాష్ట్రం నుంచి విశాఖపట్నానికి లారీ వెళ్తోంది. నాతవలస టోల్‌గేట్ వద్ద ఒక పక్కకు ఆగి ఉన్న నూకల లోడ్ లారీని జ్యూట్‌గోనెల లోడ్‌తో వెళ్తున్న లారీని బలంగా ఢీకొట్టింది. జ్యూట్ గోనెలు లారీ క్యాబిన్ దగ్గరగా నొక్కుకుపోయింది. డ్రైవర్ బసుదేబ్ సికిధర్(44) క్యాబిన్‌లో ఇరుక్కుపోయాడు. ఇంతలో ఇంజిన్‌లో నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. జ్యూట్ గోనెల లోడ్ కావడంతో క్షణాల్లో మంటలు వ్యాపించాయి. లారీ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ బసుదేబ్ సికిధర్ కాపాడాలంటూ కేకలు వేసినా ఎవరు దగ్గరకు వెళ్లలేకపోయారు. ఆయన మంటల్లోనే ప్రాణాలు విడిచాడు. అగ్నిమాపక శకటాలు వచ్చి మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. గోనెలతో పాటు లారీ పూర్తిగా కాలి బూడిదైంది. మృతుడిది పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలోని నియామపూర్ ప్రీతినగర్‌కు చెందిన వాడుగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదుచేశారు.

**మంచంపైనుంచే మృత్యు ఒడికి..**



చీపురుపల్లిరూరల్ (గరివిడి): అప్పుడే తెల్లారుతోంది. గ్రామస్తులు ఒక్కొక్కరుగా వీధుల్లోకి వస్తున్నారు. ఇంతలో ఓ పూరిగుడిసె నుంచి మంటలు వ్యాప్తిచెందాయి. ఆర్పేలోపే గుడిసెను చుట్టుముట్టాయి. అంతే... అందులో నివసిస్తున్న 70 సంవత్సరాల వయస్సు ఉన్న యడ్ల అసిరితల్లి మంచంపైనే సజీవదహనమైంది. ఈ విషాదకర ఘటన గరివిడి మండలం కోనూరు గ్రామంలో సోమవారం ఉదయం 5 గంటల సమయంలో జరిగింది. వృద్ధురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తెలు ఉన్నారు. అందరికీ వివాహాలు జరిగాయి. భార్యా పిల్లలతో గ్రామంలోనే ఉంటున్నారు. వృద్ధురాలు గ్రామంలోని పూరింటిలో నివసిస్తూ ప్రమాదానికి గురైంది. ఘటనా స్థలాన్ని గరివిడి తహసీల్దార్ సీహెచ్ బంగార్రాజు పరిశీలించారు. ఇంటిలో గ్యాస్ లీకై న కారణంగా అగ్ని ప్రమాదం సంభవించినట్టు నిర్ధారించారు.


అగ్ని ప్రమాదంలో దగ్ధమవుతున్న పూరిల్లు (ఇన్‌సెట్లో) అగ్ని ప్రమాదంలో సజీవదహనమైన అసిరితల్లి (ఫైల్)

## గిరిజన విద్యార్థులకే అధిక సీట్లు

- కోర్సులపై అవగాహన సదస్సులు నిర్వహించాలి
- ఎస్టీ కమిషనర్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు


రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావును సత్కరిస్తున్న గిరిజన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీవీ కట్టిమణి

విజయనగరం అర్బన్: కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయంలో అందుబాటులో ఉన్న వివిధ కోర్సుల్లో గిరిజన విద్యార్థులకు అధిక సీట్లు కేటాయించాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు అన్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం సంబంధిత చట్టంలో మార్పులు తీసుకురావాల్సి ఉందన్నారు. ఈ విషయమై ఎస్టీ కమిషన్ తరపున కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని చెప్పారు. అలాగే యూనివర్సిటీలో అందిస్తున్న కోర్సులపై గిరిజన యువతకు అవగాహన కల్పించాలని సూచించారు. విజయనగరంలోని గాజులరేగ ప్రాంతంలో ఉన్న కేంద్రియ గిరిజన విశ్వవిద్యాలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ టీవీ కట్టిమణి, ఇతర అధికారులు, అధ్యాపకులతో సమావేశమై గిరిజనుల అభివృద్ధిలో యూనివర్సిటీ నిర్వహిస్తున్న పాత్ర, అందిస్తున్న కోర్సులపై సమీక్షించారు. యూనివర్సిటీ నిర్వహణలో ఎదురవుతున్న సమస్యలపై ఆరా తీశారు. అంతకుముందు వీసీ, తదితరులు శంకరరావును సత్కరించారు.

**పనుల పురోగతిపై ఆరా..**

దత్తిరాజేరు/విజయనగరం అర్బన్: మెంటాడ మండలం కుంటినవలస వద్ద చేపడుతున్న గిరిజన విశ్వవిద్యాలయం శాశ్వత క్యాంపస్ నిర్మాణ పనులను ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడుతూ.. పనుల పురోగతిపై ఆరా తీశారు. 561 ఎకరాలలో యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నామని.. భూములు ఇచ్చిన రైతులకు రూ. 61.06 కోట్లు, అప్రోచ్ రోడ్డుకు రూ. 16 కోట్లు.. సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ. 48.61 కోట్లు కేటాయించినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. జాతీయ రహదారి నుంచి విశ్వవిద్యాలయ క్యాంపస్‌కు చేరుకునేందుకు అనుసంధాన రోడ్డు పూర్తి కావాల్సి ఉందని చెప్పారు. భవన నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేసి వీలైనంత త్వరగా శాశ్వత భవనాలను అందుబాటులోకి తీసుకువస్తామని చైర్మన్‌కు వివరించారు. పరిశీలనలో బొబ్బిలి ఆర్డీఓ రామ్మోహనరావు, యూనివర్సిటీ ఏఓ సూర్యనారాయణ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు జెడ్పీ అతిథి గృహంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, విజయనగరం ఆర్డీఓ కీర్తి, తదితరులు ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలసి గిరిజన విశ్వవిద్యాలయంలో వసతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చేపడుతున్న చర్యలను వివరించారు.

### బొబ్బిలిలో జిల్లా స్థాయి టేబుల్‌టెన్నిస్ పోటీలు

బొబ్బిలి: పట్టణంలోని సంస్థానం ఉన్నత పాఠశాల ఏపీ హాలులో సోమవారం జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో జూనియర్ విభాగంలో బి.హర్షిత్, బి.అభినయ కార్తీక్‌లు విన్నర్, రన్నర్‌లుగా, సీనియర్ విభాగంలో బి.ధనుంజయ్, టి.సత్యనారాయణలు విన్నర్, రన్నర్‌లుగా నిలిచారని పీడీ వెంకటనాయుడు తెలిపారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ విజయ్, బాల్‌బ్యాడ్మింటన్ సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఏబీసీ నాయుడు, రాజీవ్, అరుణ్‌కుమార్, జలగం శ్రీనివాస్ ప్రభాకర్, హెచ్‌ఎం సునీత తదితరులు పాల్గొని విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు.

## యావన్మందికీ తెలియజేయునది ఏమనగా...


అలంకరణలో పైడితల్లి అమ్మవారు

- మే 12న పైడితల్లి అమ్మవారి దేవర మహోత్సవం
- చాటింపు చేసిన ఆలయ తలయారీలు


ఆలయ ప్రాంతంలో దేవర ఉత్సవ చాటింపు వేస్తున్న ఆలయ తలయారీ బృందం

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారిని రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి నుంచి చదురుగుడికి తీసుకువచ్చే దేవర మహోత్సవానికి ఏర్పాట్లు సాగుతున్నాయి. ఈ నెల 12న నిర్వహించనున్న దేవర మహోత్సవ ఘట్టాన్ని ప్రజలందరికీ తెలియజేసేలా పైడితల్లి అమ్మవారి ఆలయ తలయారీ రామవరపు చినపైడిరాజు బృందం సోమవారం సాయంత్రం ఆలయ ఆవరణలో చాటింపు వేసింది. అమ్మవారికి భాజాభజంత్రీలు, డప్పు వాయిద్యాల నడుమ సాంబ్రాణి ధూపంతో ప్రత్యేక పూజలు నిర్వహించి మనవి చెప్పారు. ఆలయ సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, తాళ్లపూడి ధనుంజయ్, నేతేటి ప్రశాంత్, సిబ్బంది, అధికారులు అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజాధికాలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ చాటింపు వేశారు. భక్తులందరూ ఆ రోజు అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకోవాలని కోరారు.

**ఏర్పాట్లు చేస్తున్నాం**

ఆలయ ఇన్‌చార్జి ఈఓ కేఎస్‌వీడీవీ ప్రసాద్ మాట్లాడుతూ దేవర మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. మే 12వ తేదీన సాయంత్రం 4 గంటల నుంచి రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడిలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు జరుగుతాయన్నారు. అనంతరం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని గాడీఖానా, ఎన్‌సీఎస్ రోడ్డు, గంటస్తంభం మీదుగా హుకుంపేటలో ఉన్న అమ్మవారి చదురువద్దకు తీసుకువెళ్లి పూజలు చేస్తామన్నారు. రాత్రి 10 గంటలకు హుకుంపేట నుంచి ఊరేగింపుగా మంగళవారం వేకువజామున మూడులాంతర్లు వద్ద నున్న చదురుగుడి వద్దకు తరలించి ఆశీనులు చేస్తారని తెలిపారు. అప్పటి నుంచి అమ్మవారు ఉయ్యాల కంబాల మహోత్సవం వరకూ చదురుగుడిలోనే కొలువై భక్తులకు దర్శనమిస్తారన్నారు. భక్తులందరూ దేవర మహోత్సవంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, ఆలయ సూపర్ వైజర్ ఏడుకొండలు, రమేష్ పట్నాయక్, మణికంఠ, తదితరులు పాల్గొన్నారు.